క్లుప్తంగా

పకడ్బందీగా శివరాత్రి ఏర్పాట్లు



శివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం గుడిమల్లం శ్రీఆనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో ఈనెల 26న జరగనున్న శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. ఆయన శుక్రవారం గుడిమల్లం ఆలయంలో శివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల గురించి ఆలయాధికారులతో చర్చించారు. భక్తుల వాహన పార్కింగ్, బారికేడింగ్, క్యూల నిర్మాణం వంటి అంశాలపై ఆలయ ఈవో రామచంద్రారెడ్డితో చర్చించారు. ఆలయానికి వచ్చే సామాన్య భక్తులకు సైతం ప్రశాంతమైన శీఘ్ర దర్శనానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏర్పేడు సీఐ జయచంద్ర, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం గుండేలిగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురుమిత్ర వ్యవస్థాపకులు, ఉపాధ్యాయులు చెంచయ్య యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మునితిరుమలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి/వరదయ్యపాళెం: సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నిర్వహించే ధర్నాను విజయవంతం చేద్దామని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. అందుకోసం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించా రు. ఏరియా కార్యదర్శి జనమాల గురవ య్య, పట్టణ కార్యదర్శి గోపి, సత్యవేడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ ప్రతి వార్డు, ప్రతి పల్లెలో నిరుపేదలను గుర్తించి ఇల్లు, ఇంటి స్థలం కోసం అర్జీలు రాసి తహసీల్దారు కార్యాలయానికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివకుమార్, మురళి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు కాదిరివేడు ఎంపిక



కాదిరివేడు గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్మయి

సత్యవేడు: మండలంలో రీ–సర్వేకు కాదిరివేడును ఎంపిక చేసినట్లు ఆర్డీఓ కిరణ్మయి తెలిపారు. శుక్రవారం కాదిరివేడులో రీసర్వే నిర్వహణకు గ్రామ సభ నిర్వహించారు. సర్వేకు స్థానిక రైతులు సహకరించాలని ఆర్డీఓ కోరారు. రికార్డులు పూర్తి స్థాయిలో అప్‌లోడ్ చేస్తామని, కాదిరివేడు పరిధిలో 789.64 ఎకరాలు రీసర్వే చేస్తున్నట్లు సర్వేయర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందుమతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, రీసర్వే డీటీ త్యాగరాజు, మండల సర్వేయర్ చంద్రశేఖర్, వీఆర్‌ఓ మోహన్ రాజ్, గిరి, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం



పదవీ విరమణ పొందిన కండక్టర్, డ్రైవర్‌ను సన్మానిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో కండక్టర్ ఆర్ఎం నాయుడు, డ్రైవర్ రఘు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ వారిని ఘనంగా సత్కరించారు. వారికి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పోరుషోత్తమాచారి, శ్రీనివాసకుమార్, శివప్రసాద్, కుప్పయ్య, రోశయ్య, మురళి, అశోక్, రామకృష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ

వరదయ్యపాళెం: మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు వీఆర్వోలు చొరవ చూపాలని తహసీల్దార్ రాజశేఖర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలు, అధికారులతో సమీక్షించారు. సమస్యపై నిర్లక్ష్యం వహించరాదని హితవు పలికారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, ఆర్ఐ శివకుమార్ పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో ఇసుక తోడేళ్లు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): తిరుపతి జిల్లా తూర్పు మండలాలకు జీవనదిగా ఉన్న స్వర్ణముఖిలో ఇసుక తోడేళ్లు చొరబడ్డాయి. నదీ గర్భాన్ని చీల్చి ఇసుకను తోడేస్తున్నాయి. అన్నదాతల పాలిట కల్పవల్లిగా పేరొందిన ఈ నదిని అధికార పార్టీ నాయకులు చెరపట్టేశారు. రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను తవ్వి తరలించేస్తున్నారు. రేణిగుంట మండలం అడుసుపాలెం సమీపంలోని స్వర్ణముఖి నదిలో శుక్రవారం జేసీబీ, ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. నదిలోకి వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేసుకొని విచ్చలవిడిగా ఇసుక వ్యాపారం చేసుకుంటున్నారు. అరికట్టాల్సిన అధికారులు మాత్రం అటువైపు వెళ్లకపోవడం శోచనీయం. ఇప్పటికే స్వర్ణముఖి నదిలో ఇసుక అనేది లేకుండా రాళ్లు రప్పలు దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టి స్వర్ణమ్మను కాపాడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



స్వర్ణముఖి నది నుంచి ట్రాక్టర్లో ఇసుక తరలిస్తున్న దృశ్యం





స్వర్ణముఖి నదిలో వేసిన రోడ్డు, జేసీబీతో ఇసుక తవ్వి ట్రాక్టర్‌లో నింపుతున్న దృశ్యం

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన కులాల వారికి సబ్సిడీ రుణాలను అందుబాటులోకి తెచ్చిందని అర్హులైన బీసీలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విష్ణు చిరంజీవి కోరారు. ఈ మేరకు రేణిగుంట ఎంపీడీవో విష్ణు చిరంజీవి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీ, ఈబీసీ, కమ్మ, బ్రాహ్మణ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, కాపు వంటి కులాలకు చెందిన వారికి ఆర్థికంగా చేయూత అందించి స్వయం ఉపాధి కల్పించే దిశగా (వ్యవసాయం, పశువుల పెంపకం, రవాణా రంగం, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రంగాల్లో 145 రకాల యూనిట్లకు సంబంధించి) బ్యాంకు లింకేజీతో రాయితీ రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. రేణిగుంట మండలంలోని వివిధ బ్యాంకుల అనుసంధానంతో మొత్తం 74 యూనిట్లు బీసీ కార్పొరేషన్ ద్వారా కేటాయించినట్లు వివరించారు. స్థిర నివాసం గల వారు నిర్దేశించిన అర్హతలకు లోబడి కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా కలిగి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 7వ తేదీ లోపు గ్రామ సచివాలయంలో అందజేయాలని సూచించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్యం అన్నారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపుమధుసూదన్‌రెడ్డిని శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండవ సారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి విధేయులై ఉంటానని, పార్టీని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.



మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న సుబ్రహ్మణ్యం

ఉత్తమ వీఓఏ మోహనకుమారికి జ్ఞాపిక

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డుకు ఎంపికైన క్రాంతి మ్యాక్స్ గ్రామ సంఘం సహాయకురాలు మోహన కుమారి శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు జ్ఞాపిక, ప్రశంసా పత్రం, బహుమతి అందజేశారు. క్రాంతి మ్యాక్స్ గ్రామ సంఘం నుంచి రూ.70 లక్షలు రుణం తీసుకుని 100 శాతం చెల్లించినందుకుగాను ఆమెను రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. దీనిపై మండల వెలుగు సమాఖ్య సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్త్రీ నిధి ఏపీఎం హేమంత్‌కుమార్, మేనేజర్ వనజ, జయకుమార్, మల్లేశ్వరయ్య, ఏపీఎం మునెయ్య తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు నుంచి బహుమతి అందుకుంటున్న వీఓఏ మోహనకుమారి

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

నారాయణవనం: ఉపాధి పనులకు రాని వారి పేర్లతో మస్టర్లు తయారు చేసి వేతనాన్ని స్వాహా చేశారనే ఫిర్యాదుతో నారాయణవనం పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ దిలీప్‌ను డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సస్పెండ్ చేశారు. అలాగే రూ. 3,03,779 రికవరీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో 2023–24 సంవత్సరానికి చేసిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో చేసిన పనుల తనిఖీ నివేదికను వెల్లడించారు. నారాయణవనంలో పనికి రాని కూలీల పేర్లతో మస్టర్లు తయారు చేసి వేతన చెల్లింపులను ఫీల్డ్ అసిస్టెంట్ దిలీప్ చేశాడని పలువురు మేట్లు చేసిన ఫిర్యాదుతో పీడీ ఆయన్ను సస్పెండ్‌చేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి రూ 2,81,640, ఎంసీసీ కింద రూ 22,139 రికవరీ చేయాలని ఆయన ఆదేశించారు. ఉపాధి పనులను మండల స్థాయి అధికారులు తర చూ తనిఖీ చేస్తుంటే తప్పిదాలకు ఆస్కారం ఉండేది కాదని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ గుణశేఖర్, ఏపీడీ సరిత, ఏపీఓ సుకన్య డీఆర్పీలు, సీఆర్పీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, క్షేత్ర స్థా యి సిబ్బంది, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వర రావు అన్నారు. శుక్రవారం శ్రీసిటీలోని డానియల్ పరిశ్రమలో పరిశ్రమ ఉద్యోగులతో సదస్సు నిర్వహించారు. ప్రధానంగా రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే వాహనాల్లో వచ్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ద్విచక్ర వాహనాల్లో వచ్చేవారు విధిగా హెల్మెట్, కార్లలో వచ్చేవారు సీటు బెల్టు ధరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ బీవీ శ్రీనివాసులు, ఎస్‌ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారులతో పీడీ సమీక్ష



నియోజకవర్గ హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తున్న పీడీ దయాకరరావు

వరదయ్యపాళెం: సొంతంగా స్థలం ఉన్న వాళ్లు హౌసింగ్ ద్వారా పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ దయాకరరావు వెల్లడించారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సత్యవేడు నియోజకవర్గ హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్షించారు. ప్రధానంగా 2019కు ముందు మంజూరైన ఎన్టీఆర్ గృహాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, 2019 నుంచి 2024 వరకు జగనన్న కాలనీల ద్వారా గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేసిన ఇళ్ల వివరాలు, వాటికి అందాల్సిన పెండింగ్ బిల్లులు, మంజూరై ప్రారంభంకాని ఇళ్ల వివరాలపై అధికారులతో చర్చించారు. ఫిబ్రవరి నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులకు సంబంధించి వివరాలు అందజేస్తే లబ్ధిదారులకు బిల్లులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 2019 వరకు ఆగిపోయిన ఎన్టీఆర్ గృహాలకు అప్పటి యూనిట్ ధర మేరకు బిల్లు లు చెల్లిస్తామన్నారు. ఇప్పటికీ నిర్మాణం ప్రారంభం కాని ఇళ్లను రద్దు చేస్తామన్నారు. ఆ మేరకు సత్యవేడు నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో 9,050 ఇళ్లు మంజూరు కాగా 5,689 ఇళ్లు నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 1,500 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాలు ఆగిపోయాయని, ఇంటి స్థలాలు లేని వారికి స్థలాల ప్రక్రియ పూర్తయిన తర్వాత పక్కా గృహాలు మంజూరు చేస్తామన్నారు. హౌసింగ్ సిబ్బంది ఇకపై నిర్మాణాలపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. సమీక్షలో హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావు, సత్యవేడు డీఈ శేషగిరి పాల్గొన్నారు.

సత్యవేడు లేఔట్ల పరిశీలన

సత్యవేడు: నియోజకవర్గంలో హౌసింగ్ నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ దయాకర్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కాశమనాయుడు పేట, సత్యవేడు లేఔట్లను ఆయన పరిశీలించారు. మండలానికి ఇచ్చిన 334 గృహాలు టార్గెట్‌ను మార్చి31లోపు పూర్తి చేయాలని, శ్లాబు లెవెల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు ఇసుక, ఇనుము సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ శేషగిరి, ఈఈ శ్రీనివాసరావు, ఏఈ భాను ప్రకాష్ పాల్గొన్నారు.



లేఔట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

దోమల నివారణకు ఫాగింగ్



శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం గురవరాజు పల్లి పంచాయతీ రామకృష్ణాపురంలో శుక్రవారం దోమల నివారణకు పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేశారు. కార్యదర్శి సుబ్బారెడ్డి, రహీం, మునికృష్ణ పనులను పర్యవేక్షించారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి భూమిపూజ

కేవీబీపురం (వరదయ్యపాళెం): కేవీబీపురం మండల కేంద్రంలో శుక్రవారం అంబేద్కర్ భవన నిర్మాణం నిర్మాణానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భూమిపూజ చేశారు. ప్రభుత్వం ద్వారా రూరూ.30లక్షలతో దీనిని నిర్మించనున్నట్లు చెప్పారు. భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజల సామాజిక అవసరాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. టీడీపీ నాయకులు రామాంజుల నాయుడు, మల్లికార్జునరెడ్డి, థామస్, జయరామ్‌రెడ్డి, రవిచంద్రన్, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పారిశుధ్యం.. ఆదర్శనీయం

వరదయ్యపాళెం: పారిశుధ్య కార్మికుల సేవలు ఆదర్శనీయమని, వారిని ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని ఎస్‌ఐ మల్లికార్జున అన్నారు. ఎస్‌ఐ చొరవతో వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికులను శుక్రవారం స్థానికంగా ఓ కల్యాణ మండపంలో సన్మానించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. తెల్లవారక ముందే పరిసరాల శుభ్రతకు పాటుపడే పారిశుధ్య కార్మికుల సేవలను వెలకట్టలేమని, వారిని అందరూ గౌరవప్రదంగా చూడాలని కోరారు. పారిశుధ్య కార్మికులను సత్కరించి నూతన వస్త్రాలు, స్వీట్లను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ బసిరెడ్డి, ఉప సర్పంచ్ చంద్రబాబు, హెడ్ కానిస్టేబుల్ వెంకటముని, కానిస్టేబుళ్లు హరి, సుబ్బు, కిరణ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతి



లోకయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లోకయ్య (72) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. లోకయ్య మృతి పార్టీకి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. లోకయ్య కుమారుడు, మండల వైఎస్సార్‌సీపీ నేత తిరుపాల్, కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక బస్టాండు వద్ద అడ్డంగా మండల టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శుక్రవారం గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం తొలగించారు. గురువారం సాక్షి దినపత్రికలో 'ఫ్లెక్సీతో ప్రయాణికులకు ఇబ్బందులు' శీర్షికతో ప్రచురించిన కథనంపై గ్రామ కార్యదర్శి స్పందించారు. సిబ్బందితో కలసి ఫ్లెక్సీని తొలగించారు.



రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డుభద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శరత్ చంద్ర, ఎస్‌ఐ అరుణ్ కుమార్ రెడ్డి శుక్రవారం నిర్వహించారు. రోడ్ ప్రమాదాలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో విద్యార్థులకు వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. రోడ్డు భద్రత విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాదముని రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'ఫీజు పోరు' విజయవంతం చేయండి



ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్, నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5 వ తేదీ తిరుపతిలోని కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలో పార్టీ శ్రేణులతో కలిసి «ఫీజు పోరు» పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలను ఇవ్వలేనని బహిరంగంగా ప్రకటించడం సిగ్గుచేటని విమర్శించారు. అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి, ఇప్పుడు ప్రజలను నిలువుగా దగా చేస్తున్నారని, ఫీజులివ్వకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. బాబు వైఖరిని ఎండగడుతూ అన్ని వర్గాల ప్రజలతో పాటు విద్యార్థి విభాగాలతో కలెక్టరేట్ ముట్టడికి పూనుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, ఉగ్గుమూడి గురునాథం, నాయకులు గురవయ్య, కోటేశ్వరరావు, నాగేశ్వరావు, వెకటేష్, ప్రసాద్, అమలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాడలేని వైద్యులు.. అవస్థల్లో రోగులు

ఏర్పేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారులు ఎవరూ విధులకు హాజరకాకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏర్పేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లున్నారు. అయితే శుక్రవారం ఉదయం 11గంటలు దాటినా, ఇద్దరూ రాకపోవడంతో చేసేది లేక ఆస్పత్రి సిబ్బంది రోగులకు మందుబిళ్లలు ఇచ్చి పంపారు. జ్వరం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో వచ్చిన వారు ఆస్పత్రిలోనే డాక్టర్లు వచ్చే వరకు నిరీక్షించారు. ఇద్దరు డాక్టర్లలో ఒకరు 104 వాహనంలో వైద్య సేవలను అందించేందుకు మండలంలోని ఓ గ్రామానికి వెళ్లగా, మరో డాక్టర్ ఉదయం 9 గంటలకు ఆస్పత్రికి రావాల్సి ఉండగా, 11గంటలు దాటినా రాకపోవడం గమనార్హం. ఏర్పేడు పీహెచ్‌సీకి దాదాపు 30గ్రామాల నుంచి రోగులు వస్తుంటారు. అయితే డాక్టర్లు సక్రమంగా వైద్యసేవలు అందించడం లేదన్న విమర్శలున్నాయి. ఈ పీహెచ్‌సీ సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు అందడంతో గురువారం డీఎంహెచ్‌వో ఆస్పత్రిని తనిఖీ చేశారు. అయినా వైద్యాధికారుల పనితీరులో మార్పు రాకపోవటం గమనార్హం.



డాక్టర్లు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు



నిరీక్షిస్తున్న రోగులు



మందులు తీసుకుంటున్న రోగులు